క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



నిజాముద్దీన్ కాలనీలో ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేసిన దృశ్యం

ఆదోనిటౌన్: పట్టణంలోని 39వ వార్డు నిజాముద్దీన్ కాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో 600 మందికి ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ కన్వీనర్ ఫయాజ్అహ్మద్ మాట్లాడుతూ ప్రతి పేదోడికి అత్యాధునిక వసతులతో ఆస్పత్రుల నిర్మాణాలు, ఉచిత చికిత్సను అందజేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆదరిద్దామని పిలుపునిచ్చారు. సచివాలయ ఉద్యోగులు చిన్న, రాజు, గౌస్, రాజశేఖర్, పద్మావతి, విద్యావతి, లక్ష్మి, వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆదోనిఅర్బన్: మండలంలోని గణేకల్ గ్రామ సమీపంలో వల్లూరు గ్రామానికి చెందిన నాగరాజు, రంగస్వామి బుధవారం రోడ్డు ప్రమాదలో గాయపడ్డారు. స్థానికులు వెంటనే ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆదోని నుంచి స్వగ్రామానికి బైక్పై వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో తప్పించబోయి అదుపు తప్పి కిందకు పడినట్లు బాధితులు తెలిపారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కౌతాళం: ఈనెల 4,5వ తేదీల్లో మండలంలోని బదినేహాల్ గ్రామంలో రెండు రోజుల పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. బుధవారం ఆయన కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పాల్గొంటారని, మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని సూచించారు.

అధికార లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు



గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని మట్కుర్ వీధికి చెందిన కానిస్టేబుల్ కిశోర్ అంత్యక్రియలను బుధవారం అధికార లాంఛనాలతో పోలీసులు నిర్వహించారు. ఎమ్మిగనూరు పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్గా పనిచేస్తున్న కిశోర్ డిసెంబర్ 31న ఎమ్మిగనూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. జనవరి 1న చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం ఆదోనిలో కుటుంబ సభ్యులు సమక్షంలో మృతదేహాన్ని పోలీసులు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

ఆస్పరి: 'ఆడుదాం-ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆస్పరిలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలను పంచాయతీ కార్యదర్శి జంప్లా నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే మండలంలోని శంకరబండ, జొహరాపురం, చిన్నహోతూరు, బిల్లేకల్లు, ముత్తుకూరు, కైరుప్పల, కారుమంచి, ములుగుందం, బనవనూరు, డీకోటకొండ, చిగిళి, బిణిగేరి, నగరూరు, తంగరడోణ, యాటకల్లు, హలిగేర గ్రామాలలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రశాంతంగా వేలంపాట

మద్దికెర: పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో ఏడాది పాటు స్వామివారి ఫోటోలు విక్రయించేందుకు బుధవారం దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించగా బాల్యంరవి రూ.65 వేలకు దక్కించుకున్నారు. అలాగే భక్తులు స్వామివారికి సమర్పించిన మిశ్రమ బియ్యం పోగుచేసుకునే హక్కులను వడ్డె రంగన్న రూ.36,686లకు దక్కించుకున్నట్లు ఈఓ చంద్రశేఖర్రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ తెలిపారు. తలనీలాల వేలంపాటకు సరైన స్పందన లేకపోవడంతో ఈ నెల 10 తేదీకి వాయిదా వేశారు.

ఆవుకు ఆరు కాళ్ల దూడ జననం



తుగ్గలి: మండల కేంద్రంలో తిరుగుతున్న ఓ ఆవు బుధవారం ఆరు కాళ్ల దూడకు జన్మనిచ్చింది. దూడ వెనుక భాగంలో అదనంగా రెండు కాళ్లు ఉన్నాయి. గ్రామస్తులు దీన్ని వింతగా చూశారు. ఈవిషయమై పశు వైద్యాధికారిణి ప్రణీతను సంప్రదించగా జన్యులోపం వల్ల అరుదుగా ఇలాంటి దూడలు జన్మిస్తాయని తెలిపారు.

సంక్షేమ సారథి జగనన్న



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



ఎరిగేరిలో వృద్ధురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం/కౌతాళం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి సకల రంగాల సంక్షేమ సారథిగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం కౌతాళం మండలం ఎరిగేరి గ్రామంలో పర్యటించారు. కాచాపురం సర్పంచు వై.జయమ్మతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న నవరత్నాలు ప్రవేశపెట్టి దేశంలోనే ఆదర్శ పాలకుడిగా వర్ధిల్లుతున్నారని కొనియాడారు. ప్రజల చెంతకు పాలన తీసుకువచ్చి పల్లెవాసుల జీవన ప్రమాణాలు మార్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. టీడీపీ, జనసేన ఇతర పార్టీలు ఏకమై వచ్చినా తమకు నష్టం లేదన్నారు. పేదల జీవన స్థితిగతులు మెరుగు పడేందుకు నవరత్నాలు ఎంతగానో దోహదపడ్డాయని చెప్పారు.

ప్రతి పల్లెలోనూ ప్రగతి సౌదాలు :

తమ ప్రభుత్వం హయాంలో ప్రతి పల్లెలోనూ ప్రగతి సౌదాలు వెలిశాయని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రజల చెంతకు పాలన తెచ్చేందుకు ప్రతి పల్లెలోనూ గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్లు నిర్మించారని చెప్పారు. వైఎస్సార్సీపీ గ్రామ నాయకుడు ధర్మన్న ఇటీవల అనారోగ్య రీత్యా ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలుసుకొని ఎమ్మెల్యే ధర్మన్న ఇంటికి వెళ్లి యోగ క్షేమాలు అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ రామలింగయ్య స్వామి, జేసీఎస్ కన్వీనర్ వెంకట్రామిరెడ్డి, సర్పంచు గోవిందు, సీనియర్ నాయకులు వీరసేనారెడ్డి, దాట్ల సుబ్బరాజు, గురురాఘవేంద్రరెడ్డి, నీలకంఠరెడ్డి, తహసీల్దార్ రామేశ్వరరెడ్డి, ట్రాన్స్కో ఏఈ నరసన్న, పీఆర్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఏవో శేషాద్రి, ఎస్ఐ నరేంద్రకుమార్రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం



రూ.18 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల డిస్ప్లే బోర్డును ఏర్పాటు చేసిన దృశ్యం

ఆదోనిటౌన్: కేవలం కొన్ని వ్యాధులకే పరిమితమై నిస్తేజంగా మారని ఆరోగ్యశ్రీ పథకాన్ని వైఎస్ జగన్మోహన్రెడ్డి సీఎం అయ్యాక జవసత్వాలు సమకూర్చి 3,275 జబ్బులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లోనూ పేదలకు వైద్యం అందేలా చర్యలు చేపట్టడంతో పాటు ఇటీవల ఆరోగ్యశ్రీ పథకం మొత్తం రూ.5లక్షల నుంచి రూ.25లక్షల వరకు పెంచి పేదలకు ఆరోగ్య రక్షణ ఏర్పాటు చేశారని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పేర్కొన్నారు. అలాగే..చికిత్స పొందిన బాధితులు కోలుకునేంతవరకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రోజుకి రూ.225 చొప్పున అందజేస్తుందన్నారు. బుధవారం పట్టణంలోని 34వ వార్డు విక్టోరియాపేట, టీజీఎల్ కాలనీలో ప్రాంతాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాండురంగస్వామి కల్యాణ మండపం వద్ద జెండాను ఆవిష్కరించారు. రూ.18.56 కోట్లతో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల డిస్ప్లే బోర్డును ఏర్పాటు చేశారు. వార్డు ఇన్చార్జ్ భాస్కర్, పట్టణాధ్యక్షుడు దేవా అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగనన్న గెలిపించుకొని సంక్షమాభివృద్ధిని కొనసాగించుకుందామని చెప్పారు. కార్యక్రమంలో కన్వీనర్ ఫయాజ్అహ్మద్, సీఓ వీరారెడ్డి, ఆదోని డివిజనల్ అభివృద్ధి అధికారి ఎం.నాగేశ్వరరావు, వైస్ చైర్మన్ నరసింహులు, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, పార్టీ కార్యకర్తలు, నాయకులు శోభాలత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



సబ్కలెక్టర్కు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

ఆదోనిరూరల్: మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, కేజీబీవీ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని జేఏసీ ఉపాధ్యక్షుడు మహ్మద్రఫీ, జేఏసీ ప్రధాన కార్యదర్శి రంగన్న కోరారు. బుధవారం సబ్కలెక్టర్ శివనారాయణశర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పిన హామీని అమలు చేయాలన్నారు. జేఏసీ నాయకులు నాగరత్నమ్మ, సాయిబేస్, మల్లికార్జున, బీచుపల్లి, గౌస్, నాగవేణి పాల్గొన్నారు.

స్త్రీ విద్య కోసం శ్రమించిన సావిత్రీబాయి



సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



వైఎస్సార్సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కౌతాళంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆదోనిరూరల్: స్త్రీ విద్య కోసం అహర్నిశలు శ్రమించిన తొలి ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే అని మహిళా కన్వీనర్ నిఖిత, డివిజన్ సెక్రటరీ శివ అన్నారు. బుధవారం పట్టణంలోని బాలికల పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా పీడీఎస్ఓ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్ఓ నాయకులు గోవిందు, సాయి, వీరేష విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదోనిటౌన్: సావిత్రీబాయిపూలే 193వ జయంతిని పట్టణంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు దేవా, బీసీ ఫెడరేషన్ సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. దేవా, బీసీ ఫెడరేషన్ పట్టణాధ్యక్షుడు వీరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు వేర్వేరుగా మాట్లాడారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్సీపీ నాయకులు తాయన్న, మల్లికవ్వ, ఫర్హత్బాను, ఇస్మాయిల్, వహీం, వై.పి.గంగాధర్, రామకృష్ణ, నాగరాజ్, మణి, హరికృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

కోసిగి: మొదటి ఉపాధ్యాయిని సావిత్రీబాయిపూ జయంతిని స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. హెచ్ఎం ఖలీల్ అహ్మద్, పల్లెపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం దస్తగిరి బాషా ఆధ్వర్యంలో ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఉపాధ్యాయినులు మీనాక్షి, యశోద, హసీనా, మానస, సంధ్య, పద్మ పాల్గొన్నారు.

కౌతాళం: మహిళలందరికీ సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శం కావాలని ప్రతిభ హైస్కూల్ హెచ్ఎం జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయినులు జయలక్ష్మి, సయ్యదా సబిహా అన్నారు. బుధవారం సావిత్రిబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దాడిలో గాయపడ్డ యువకుడు మృతి



మృతిచెందిన మహబూబ్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని శ్రీనివాస సర్కిల్ వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో తీవ్రంగా గాయపడిన మహబూబ్ (28) అనే యువకుడు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎన్టీఆర్ కాలనీకి చెందిన మహబూబ్ ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా శ్రీనివాస సర్కిల్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంగతి తెలిసిందే. బాధితుడు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



నాగేష్ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మంత్రాలయం : స్కూల్ గేమ్స్లో అండర్-17 క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నాగేష్ ఎంపికయ్యారు. కర్నూలులోని అవుట్ డోర్ స్టేడియంలో జరిగిన క్రికెట్ పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం అంపయ్య తెలిపారు. బుధవారం విద్యార్థిని ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 7,8,9 తేదీల్లో గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగే పోటీల్లో నాగేష్ పాల్గొంటాడని చెప్పారు.

విద్యార్థిని ఆత్మహత్య

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీలో కడుపునొప్పి తాళలేక బి.గౌతమి అనే విద్యార్థినీ బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. ఎస్ఎంటీ కాలనీలో నివాసముంటున్న మల్లికార్జున కుమార్తె గౌతమి మాచాని సోమప్ప ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. బుధవారం ఉదయం కడుపునొప్పి ఎక్కువ కావడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో గుడిసె ఇనుప పైపులకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఆమెను కిందకు దించి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ మస్తాన్వలి తెలిపారు.

మార్కెట్ ధరకే కందులు కొనుగోలు

హాలహర్వి: మండలంలోని రైతులు ఖరీఫ్లో పండించిన కందులను రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్ ధరకే కొనుగోలు చేస్తుందని ఏఓ శివశంకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని బేవినహాళ్, సాకిబండ, హాలహర్వి, కామినహాళ్, శ్రీధర్హాళ్ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులు సాగుచేసిన కంది పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1400 హెక్టార్లలో రైతులు కంది పంటను సాగుచేశారన్నారు. వారికి గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

పైప్లైన్ ఏర్పాటు

కౌతాళం: స్థానిక బుడగజంగాల కాలనీలో తాగునీటి ఎద్దడి నివారణకు నూతన పైప్లైన్ నిర్మాణం చేపట్టారు. గత వారం జరిగిన గడప గడప మన ప్రభుత్వ కార్యక్రమంలో కాలనీ వాసులు నీటి సమస్య గురించి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకురాగా.. స్పందించిన ఎమ్మెల్యే ప్రత్యేక పైప్లైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో సర్పంచ్ పాల్దినకర్ బుధవారం పైప్లైన్ పనులు చేపట్టారు. త్వరలో పనులు పూర్తి చేసి నీటి సమస్య పరిష్కరిస్తామని సర్పంచ్ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిరూరల్: పత్తికొండ మండలం చిన్నహుల్తి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. వెంకటేశ్వర్లు ద్విచక్ర వాహనంపై నాగరాళ్ల నుంచి 90 ఎం.ఎల్. పరిమాణం గల నాలుగు బాక్సులను మోటార్ సైకిల్పై తరలిస్తుండగా మదిరె క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకుని, మద్యం స్వాధీనం చేసుకొని రిమాండ్కు పంపినట్లు ఎస్ఐ చెప్పారు.

పశువులకు గాలికుంటు టీకాలు

కోసిగి: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేస్తున్నామని పశువైద్యాధికారి సంతోష్ కుమార్ తెలిపారు. బుధవారం మూగలదొడ్డి గ్రామంలో ఆవులు, గేదెలు, ఎద్దులకు గాలికుంటు టీకాలు వేయించారు. రైతులు, పశుపోషకులు ముందస్తుగా పశువులకు టీకాలు వేయిస్తే వ్యాధి ప్రబలే అవకాశముండదని చెప్పారు. గ్రామాల్లో గోపాల మిత్ర ఇంటింటికీకి వచ్చి టీకా వేస్తారన్నారు. గోపాల మిత్ర సత్య శేఖర్, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు సోమేష్, ఎల్ఎస్ఏ స్వరాజ్ కుమార్, సిబ్బంది చాంద్బాషా ఉన్నారు.

ఒకే ఈతలో మూడు కోడెదూడలు



మూడు కోడెదూడలను ఈనిన ఆవుతో రైతు మద్దిలేటి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలోని సర్పరాజాపురం(కొత్తూరు) గ్రామానికి చెందిన రైతు హరిజన సున్నపు మద్దిలేటికి చెందిన ఆవు మంగళవారం రాత్రి మూడు కోడెదూడలకు జన్మనిచ్చింది. అందులో ఒక కోడెదూడ చనిపోగా రెండు ఆరోగ్యంగా ఉన్నట్లు బుధవారం పరిశీలించిన వెటర్నరీ సిబ్బంది మస్తాన్ తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆవును, కోడెదూడలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదే ఆవు రెండేళ్ల క్రితం మూడు కొడెదూడలకు జన్మనివ్వగా అప్పుడు కూడా ఒక దూడ చనిపోగా రెండు కోడెదూడలు ప్రస్తుతం హుషారుగా ఉన్నట్లు రైతు తెలిపారు.

టీబీ డ్యాంలో 10 టీఎంసీల నీటి నిల్వ



హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో బుధవారం 105.788 టీఎంసీల పూర్తి సామర్థ్యానికిగాను 10.262 టీఎంసీల నిరు నిల్వ ఉన్నాయి. ఇన్ఫ్లో, అవుట్ఫ్లో జీరోగా నమోదైంది. నీటిమట్టం 1589 అడుగులకు తగ్గింది. గతేడాది ఇదే సమయానికి 73.746 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఈ ఏడాది జలాశయంలో నీటి నిల్వ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో గత నెల 25న తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు నీరు బంద్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో కాలువ కింద రబీ సాగు జరగలేదు.

పోలింగ్ బూత్లను పక్కాగా పరిశీలించండి



అధికారులతో సమీక్షిస్తున్న ఎంఈఈ రాధాకృష్ణ

ఆదోనిటౌన్: మరో రెండు, మూడు నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్లను పక్కాగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాధాకృష్ణ ఉద్యోగులకు సూచించారు. పోలింగ్ బూత్లలో సౌకర్యాలు ఉన్నాయా లేదా గుర్తించి వాటిని నివేదిక రూపంలో పంపాలని చెప్పారు. బుధవారం ఎంఈ ఛాంబర్లో పోలింగ్ బూత్ల పరిశీలన, వసతుల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడారు. పట్టణంలో 158 పోలింగ్ బూత్లు ఉన్నాయని, వాటిలో విద్యుత్, తాగునీటి, బాత్రూమ్లు, ఫర్నీచర్స్ తదితర సౌకర్యాలు ఉన్నాయా, లేదా అని పరిశీలించాలన్నారు. సమావేశంలో డీఈలు వెంకట చలపతి రెడ్డి, నాగభూషణ్రెడ్డి, గోపీనాథ్, ఏఈలు రాజశేఖర్రెడ్డి, కృపాకర్, డీఈ రాజునాయక్, ఏఈలు రాజశేఖర్రెడ్డి, కృపాకర్, ఏసీపీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి



పూజల్లో పాల్గొన్న భక్తులు

కౌతాళం: మండలంలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం స్వామి వారి ఆలయ 9వ వార్షికోత్సవ వేడుకలు గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి తొమ్మిదేళ్లు పూర్తి కావడంతో ఈ వేడుకలను గ్రామస్తులు, ఆర్య వైశ్యులు, అంజనేయస్వామి భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు పూజారి ఉమేష్, సర్పప్ప స్వామి వారి మూలవిరాట్ను వెండి కవచంతో అలకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అంతకు ముందు ఆలయంలోని సీతారాములకు పురోహితులు కల్యాణోత్సవం జరిపించారు. వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదానం చేశారు.

నిబంధనల మేరకే వ్యవసాయేతర భూములుగా మార్పు



ఆదోనిలో పౌర సరఫరాల గోదాము పాయింట్ను తనిఖీ చేస్తున్న సబ్కలెక్టర్



మండిగిరిలో వ్యవసాయేతర భూముల రికార్డులను పరిశీలిస్తున్న సబ్కలెక్టర్

ఆదోనిరూరల్: వ్యవసాయ భూములను నిబంధనల మేరకే వ్యవసాయేతర భూములుగా మార్చుతామని ఆదోని సబ్కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని గోనబావి, మండిగిరి, బసాపురం, కల్లుబావి గ్రామల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చడానికి నిబంధనల ప్రకారం మార్కెట్ విలువలో 5 శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇలా భూముల మార్పునకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వాటిని నాళ యాక్ట్ ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించామని చెప్పారు.

గ్రామ సచివాలయం తనిఖీ

మండలంలోని మండిగిరి గ్రామ సచివాలయాన్ని సబ్కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, ఒక నెలలో సచివాలయం ద్వారా ఎన్ని సేవలు అందించారని ఆరా తీశారు. హాజరు పట్టిక, మూమెంట్ రిజిస్టర్, పలు రికార్డులను పరిశీలించారు. అలాగే.. ఆదోని పట్టణంలోని పౌర సరఫరాల గోదాము పాయింట్ను సబ్కలెక్టర్ తనిఖీ చేశారు. గోదాములో రేషన్ నిల్వ, రికార్డులు, భద్రత తదితర అంశాలను పరిశీలించారు. ఆయన బియ్యం పంపిణీలో పొరపాట్లకు తావివ్వొద్దని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన..

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా నియోజకవర్గంలోని పలు పోలింగ్కేంద్రాలను తనిఖీ చేశారు. మండలంలోని గోనబావి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, మండిగిరి పంచాయతీలోని గ్రామ సచివాలయం, మండల పరిషత్, ఆదర్శ ప్రాథమిక పాఠశాల, బసాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి వసతులు, తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్,రాంప్ తదితర సదుపాయాలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆర్ఐ జయరామరెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా మారెమ్మ దేవర



కుంభాల ఊరేగింపులో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



వెండి అలంకరణలో పూజలందుకుంటున్న దుర్గాదేవి

కోసిగి: మండలంలోని కందుకూరు, అగసనూరు గ్రామాల్లో గ్రామ దేవత మారెమ్మ దేవర ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచి అమ్మవారిని ఊరేగింపుగా ఆలయం చెంతకు తీసుకొచ్చి ఆలయంలో కొలువుంచి ఫల,పుష్పాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం ప్రతి ఇంటి నుంచి కుంభాలను కళశాలు, డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. ఉత్సవాలకు వైఎస్సార్ సీపీ మండల ఇన్చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామ దేవతను దర్శించుకుని పూజలు చేశారు. ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, నాడుగేని నాగరాజు పాల్గొన్నారు. వారికి గ్రామ నాయకులు సర్పంచ్ ఉలిగయ్య. మాజీ సర్పంచ్ ఆకాష్ రెడ్డి, కందుకూరులో తాయన్న ఆధ్వర్యంలో సన్మానించారు.

కౌతాళం: మండలంలోని పొదలకుంట, కాత్రికి, నదిచాగి, గోతులదొడ్డి, మరళి గ్రామాల్లో దేవర బుధవారం వైభవంగా జరిగింది. కాత్రికి మినహా మిగిలిన గ్రామాల్లో తెల్లవారు జామున 2గంటలకు మేటి కుంభానికి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయాల్లో ఆకుపూజ, కుంకుమార్చన, ప్రత్యేక పూజలతో ఉత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు కుంభాలతో తరలివచ్చి మారికాంబదేవి, దుర్గా దేవికి పూజలు చేశారు. ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు.

క్రికెట్ పోటీలకు క్రీడాకారులు ఎంపిక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్

ఆదోని సెంట్రల్: అంతర్ విశ్వవిద్యాలయాల మధ్య జరిగే క్రికెట్ క్రీడా పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తున్నామని ఆదోని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ తెలిపారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఫిజికల్ డైరెక్టర్ కంబిరెడ్డి ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాయలసీమ యునివర్సిటీ క్రికెట్ సెలెక్షన్ ప్రణాళిక ప్రకారం క్రీడాకారులను ఎంపిక చేస్తున్నామని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు విశ్వ విద్యాలయం తరపున ఈ నెల 7వ తేదీ చెన్నై హిందుస్థాన్ యూనివర్సటీలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ సురేష్ , ఎర్రిస్వామి యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ కెవి. శివ కిషోర్ పాల్గొన్నారు.